క్లుప్తంగా

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మార్కాపురం: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రాగమయి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి కోరారు. ఎంపీజే ఆధ్వర్యంలో జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార ఉద్యమంలో భాగంగా గురువారం సెబ్ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సహకారం అందిస్తున్నామని ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్‌బాబు తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ కోరారు. ఎస్‌ఐ పద్మజ, ఎంపీజే నాయకులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డికి అభినందనలు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన గుజ్జుల సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన్ను పలువురు అభినందించారు. సంజీవరెడ్డి 2014 నుంచి 2022 జూలై వరకు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇచ్చారని, జగనన్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు శాయశక్తులా పని చేస్తానని చెప్పారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పెద్దలు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, ఉడుముల శ్రీనివాసులురెడ్డి, మండల నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, వాకా వెంకటరెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, కల్లం సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, సాయిరాజేశ్వరరావు, కె.నరసింహారావు, బ్రహ్మారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో మంత్రి కృషి అభినందనీయం

పెద్దదోర్నాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ స్థల సేకరణకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎంతో కృషి చేశారని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మంత్రి సురేష్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో రూ.50 కోట్ల నిధులతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయడంతోపాటు రోడ్లను అభివృద్ధి చేశారని వివరించారు. సమావేశంలో వైయస్సార్ సీపీ నాయకులు బొగ్గరపు రమేష్, తొమ్మండ్రు గాంధీ, రావిక్రింది సుబ్బారావు, పరుచూరి సీతారామయ్య, ప్రసాద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్వరి మహోత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల నుంచి కల్వరి మహోత్సవాలు క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.సతీష్‌కుమార్ బైబిల్ గ్రంథంలోని పవిత్ర బోధనల ద్వారా ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలని బోధించారు. సెయింట్ పాల్స్ బీఈడీ విద్యాసంస్థల అధినేత గోనె ఆశీర్వాదం, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు గోనె రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దాలి

పుల్లలచెరువు: విద్యార్థుల సామర్థ్యాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ శామ్యూల్‌జాన్ పేర్కొన్నారు. గురువారం కొమరోలు, నరజాముల తండాలోని పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని స్పష్టం చేశారు.

వైభవంగా రామస్వామి ఆలయ గోపుర ప్రతిష్ట




ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారు శివారులోని నాయీబ్రాహ్మణ కాలనీ వద్ద శ్రీ గణపతి త్యాగరాజ సమేత అభయ రామస్వామి ఆలయ గోపుర ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కామూరి రమణారెడ్డి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో నివాసాలకు మహర్దశ

- రూ.4.42 కోట్లతో తాగునీటి సరఫరా
- అమృత్ 2.0 ప్రాజెక్టు ద్వారా నిధుల కేటాయింపు
- మొత్తం 912 గృహాల నిర్మాణం



మార్కాపురం పట్టణ వ్యూ

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని నాగులవరం రోడ్డు వద్ద నిర్మిస్తున్న టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నివాసాల వద్ద నీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 ప్రాజెక్టు ద్వారా రూ.4.42 కోట్లు కేటాయించింది. మొత్తం ఇక్కడ 912 గృహాలు కడుతున్నారు. కేవలం ఒక్క రూపాయి మాత్రమే లబ్ధిదారుల ద్వారా వసూలు చేసి మిగిలిన ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. మున్సిపల్ పరిధిలో ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టిడ్కో ద్వారా స్థలాలు సేకరించి ఇళ్లు కట్టించి ఇస్తోంది. పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నారు. తాగునీటి సౌకర్యంతో పాటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, వీధి లైట్లు ఏర్పాటు చేయనున్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా టిడ్కో గృహ సముదాయంలో ప్రతీ వీధికి, ప్రతీ ఇంటికి సాగర్ నీరు అందించనున్నారు. ఇందు కోసం అక్కడ ఓవర్ హెడ్ ట్యాంక్ కట్టనున్నారు. దీని ద్వారా పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీరు అందిస్తారు. ప్రస్తుతం పట్టణంలో 35 వార్డులు ఉండగా సుమారు 80 వేల మందికిపైగా జనాభా ఉన్నారు. పట్టణ ప్రజల అవసరాల కోసం దూపాడు వద్ద సాగర్ నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లో నిల్వ ఉంచి రెండు రోజులకు ఒకసారి అందిస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంక్ 2,200 మిలియన్ లీటర్ల నీరు ఉంది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని పట్టణంలో సుమారు 7 వార్డులకు సాగర్ నీటి సరఫరాతో పాటు పైప్‌లైన్ల మరమ్మతులకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి 25 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు సాగర్ నీరు అందిస్తారు.

మార్కాపురంపై ప్రత్యేక దృష్టి:



నియోజకవర్గ కేంద్రం మార్కాపురం పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి జరుగుతోంది. అమృత్ 2.0లో వచ్చిన నిధులతో టిడ్కో గృహ సముదాయాల వద్ద తాగునీటి వసతి కల్పిస్తాం. ఇప్పటికే పట్టణంలో పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తెచ్చేందుకు ప్రయత్నిస్తా.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి:



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో మార్కాపురం మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతోంది. వివిధ ప్రాంతాల్లో నూతన గదులు ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో సిమెంట్ రోడ్లు, కాలువలు, పార్కులు నిర్మిస్తున్నాం.

– సీహెచ్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ చైర్మన్

నీటి సమస్య తీరుతుంది:



మార్కాపురం పట్టణ ప్రజలకు ప్రస్తుతానికి నీటి సమస్య పెద్దగా లేదు. ఇటీవలే ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి 25 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. దీని ద్వారా పట్టణ ప్రజలకు సాగర్ నీరు అందించనున్నారు.

– షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ వైస్ చైర్మన్

త్వరలో పనులు ప్రారంభం



అమృత్ 2.0 ప్రాజెక్టులో వచ్చిన నిధులను టిడ్కో నివాసాల వద్ద తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు ఖర్చు చేస్తాం. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

– గిరికుమార్, మున్సిపల్ కమిషనర్

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

- దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న డీఎస్పీ

దర్శి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి సూచించారు. దర్శి సర్కిల్ కార్యాలయం పరిధిలోని సైబర్‌నేరాల గురించి ఆయన మాట్లాడుతూ ఏటీఎం కార్డు తీసుకుని మనీ విత్ డ్రా చేస్తామని పిన్ నంబర్ సేకరించి చివరకు మనీ విత్‌డ్రా అవటం లేదని, వారికి వేరొక ఏటీఎం కార్డు ఇచ్చి మోసం చేస్తున్నారని చెప్పారు. కొత్తవారికి ఏటీఎం కార్డులు, పిన్ నంబర్లు ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. సైబర్ నేరగాళ్లు సైబర్ క్షేత్రాన్ని దుర్వినియోగం చేసి ప్రపంచ భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారన్నారు. ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉన్న సైబర్ నేరస్తులు మన నెట్టింట్లో ప్రవేశించి మన బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన ప్రైవసీని దెబ్బ తీస్తున్నారని, కంప్యూటర్ ముందు మీటలు నొక్కుతూ అంతరిక్షంలోని కృత్రిమ ఉపగ్రహాల వ్యవస్థను ఛిద్రం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారన్నారు. ఒక్క బటన్ నొక్కితే శత్రు దేశంలో అణ్వాయుధాలు రీప్రోగ్రామింగ్ జరిగి విధ్వంసం జరిగే ప్రమాదముందన్నారు. కంప్యూటర్ వ్యవస్థలను విధ్వంసం చేసి అత్యంత సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నారని తెలిపారు. సోషల్ నెట్ వర్కింగ్ పేరుతో ఆడవాళ్లపై లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో దేశాల మధ్య యుద్ధాలకు సైబర్ క్షేత్రాలే వేదికలవుతాయనేందుకు ఇప్పటికే అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సబర్‌నేరాలు అంటారన్నారు. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయటం, బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయటం, భద్రతకు ముప్పు కలిగించటం చేస్తున్నారన్నారు. నేరాలు ప్రత్యక్షంగా కాకుండా ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్షేత్రంలో జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సెల్ ద్వారా వచ్చే మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి సూచించారు. ఆయన వెంట సీఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

దేవ ప్రసాద్‌కు అభినందనలు



మద్దిశెట్టి శ్రీధర్‌ను సన్మానిస్తున్న దేవప్రసాద్

దర్శి: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా దర్శికి చెందిన గాలిమూటి దేవప్రసాద్‌ను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు దేవప్రసాద్ గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్‌ను దర్శి ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి తనను నియమించేందుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దేవప్రసాద్‌ను ఎంపీపీ గోళ్లపాటి సుధాఅచ్చయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కేసనపల్లి నాగేశ్వరరావు, చర్మ, డప్పు కళాకారుల సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జి.గోవింద్ ప్రసాద్‌లు శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఐశ్వర్యకు అభినందనలు



ఐశ్వర్యకు ప్రశంస పత్రం ఇస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కొనకనమిట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పొదిలి ఐశ్వర్య ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మూడో బహుమతి సాధించింది. ఈ మేరకు గురువారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం రామాంజనేయులు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు, బయోలాజికల్ ఉపాధ్యాయుడు దాసరి గురుస్వామి పర్యవేక్షణలో ఐశ్వర్యకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. మేథమేటికల్ మోడలింగ్ విభాగంలో గైడ్ టీచర్ కె.పద్మజ పర్యవేక్షణలో ఐశ్వర్య తయారు చేసిన వివిధ ఆకృతుల ఉపరితల వైశాల్యాలు కనుగొనే ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో మూడో బహుమతి రావడం అభినందనీయమన్నారు. గైడ్ టీచర్స్ పద్మజ, మల్లేశ్వరి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిజ జీవితంలో ఇళ్ల నిర్మాణంలో గోడలకు ప్లాస్టింగ్ వేయుట, రంగులు వేయించుటకు, నీటితొట్లు నిర్మించుటకు, తక్కువ ప్రదేశంలో ఎక్కువ పరిమాణం గల భవనాలు నిర్మించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు ఐశ్వర్య, నల్లపు మనోహర్‌లకు మెమెంటో, బహుమతులు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ కడెం అంజిబాబు యాదవ్, ఉపాధ్యాయులు రామారావు, రవికుమార్, యుద్ధ శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మల్లేశ్వరి, మనోరమ, సుభాషిణి పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అర్థవీడు (కంభం): స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను గురువారం మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ మాలతి, ఎంఈఓ అబ్దుల్ హకీం, ఎంపీడీఓ వీరభద్రాచారి, తహసీల్దార్ రవిబాబు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌కు ముండ్లమూరు విద్యార్థి

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అనమలమూరి గీతేంద్ర రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఒంగోలులో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో గణితశాస్త్ర మోడలింగ్ టీమ్‌లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. గీతేంద్ర జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, డీఈఓ రమేష్‌ల చేతుల మీదుగా బుధవారం ప్రశంస పత్రం అందుకున్నారు. ఆ విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడంతో గురువారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 28న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని డీఆర్‌సీ ఏడీఈ ప్రభాకర్ సూచించారు. బొట్లపాలెంలో జీఏపీ రైతులతో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వరిలో చీడపీడలను గుర్తించే విధానం గురించి వివరించారు. డీఆర్సీ ఏఓ సుచరిత, ఏఓ బాలకృష్ణ నాయక్, వెంకట్రావు, బాజీ, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

రికార్డులు అందుబాటులో లేవు

కురిచేడు: స్థానిక గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై కనిగిరి డివిజన్ పంచాయతీ అధికారి శోభన్‌బాబు గురువారం రికార్డులు పరిశీలించారు. ఆయనకు కొన్ని రికార్డులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉన్న రికార్డులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ రిటైర్డ్ స్వీపర్ కంభంపాటి కోటయ్య 2017లో పదవీ విరమణ చేశారు. ఆనాటికి ఆయనకు 42 నెలల జీతం పెండింగ్ ఉంది. క్యాష్‌బుక్ ప్రకారం ఆ జీతం చెల్లించారు. ఆ లెక్క సరిపోయింది. ఆయన పెన్షన్ తాలూకా నిధులు ఏమయ్యాయని తెలుసుకునేందుకు రికార్డులు ఆడిట్‌లో ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ తెలిపారని, వాటిని తెప్పించిన తర్వాత వచ్చి పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తానని డీఎల్‌పీఓ తెలిపారు. ఆయన వెంట పడమరవీరాయపాలెం పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థిని ఆసిఫాకు అభినందన

యర్రగొండపాలెం: జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థిని షేక్ ఆసిఫా తబసుంను ఎంఈఓ పి.ఆంజనేయులు, హెచ్‌ఎం బీరెళ్ల శామ్యూల్ జాన్ గురువారం అభినందించారు. ఒంగోలులో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో 150 పాఠశాలల నుంచి ఐదు విభాగాల్లో 170 ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శించారు. అందులో యర్రగొండపాలెం హైస్కూల్ టెన్త్ విద్యార్థిని ఆసిఫా ప్రతిభ చాటింది.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ, జెడ్పీటీసీ మారం

తాళ్లూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం సాధ్యమైందని వక్తలు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం కిమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సహకారంతో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని, ప్రాథమిక పరీక్షల అనంతరం ఇబ్బందులు ఉంటే వైద్యశాలలో ఆరోగ్యశ్రీలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స అందిస్తారని చెప్పారు. అవ్వా, తాతలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కిమ్స్ హాస్పటల్ సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కిమ్స్ వైద్యనిపుణులు డాక్టర్ బి. రామాంజనేయులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు, మందా శ్యామ్సన్, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, వలి, ఎంపీటీసీ బాలకోటయ్య, ఉప సర్పంచి కాశిరెడ్డి, గుంటి గంగా కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఎంఎల్‌ఓ జి.మల్లేశ్వరరెడ్డి, రవి, జయరామిరెడ్డి, పీఆర్‌ఓ జి.గురవయ్య పాల్గొన్నారు.

బాలినేనిని సన్మానించిన శ్రీనివాసరెడ్డి



బాలినేనిని సన్మానిస్తున్న యాడిక శ్రీనివాసరెడ్డి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని తాళ్లూరు మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి గురువారం ఒంగోలులో కలిసి సన్మానించారు. పార్టీలో తనను జేసీఎస్ కన్వీనర్‌గా నియమించేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి ప్రతి నాయకుడిని కలుపుకుని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యాడికకు రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిశెట్టి రవీంద్ర, మద్దిశెట్టి శ్రీధర్‌ల నమ్మకాన్ని నిలుపుకుంటానని చెప్పారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కేపీ, ప్రముఖులు



స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శివపార్వతుల రథోత్సవం అత్యంత వైభవంగా భక్తుల శివనామ స్మరణ మధ్య జరిగింది. రాత్రి 7 గంటలకు స్వామి వారిని రథోత్సవంపై ప్రతిష్ఠించిన అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారి రథాన్ని నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. హరహర మహాదేవ అంటూ భక్తులు భక్తిపరవశ్యంతో రథాన్ని లాగారు. రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారి రథోత్సవం తిలకించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవశర్మ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీ కిశోర్ కుమార్, సీఐ భీమానాయక్, ఎస్‌ఐలు శశికుమార్, సుమన్‌లు బందోబస్తు పర్యవేక్షించారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో 60వ హరే రామనామ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘునాథచార్యులు శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేద మంత్రాల మధ్య నిర్వహించారు. కల్యాణానికి ఉభయదాతలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణ దాతలుగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్న రాంబాబు, జి.లక్ష్మిరెడ్డి వ్యవహరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి ఏర్వ వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఏపీజీబీ ఖాతాదారుల సమావేశం

తర్లుపాడు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతదారుల సమావేశం తర్లుపాడులోని ఆ శాఖ ఆవరణలో గురువారం నిర్వహించారు. సమావేశానికి నంద్యాల రీజనల్ మేనేజర్ ఎస్.నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తర్లుపాడు శాఖ ప్రారంభించి ఆరేళ్లయిందని, రూ.40 కోట్ల టర్నోవర్‌తో దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఇతర బ్యాంక్‌ల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీగా 7.80 శాతం చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఫిక్స్‌డ్ డిపాజిట్, ప్రగతి సిరి డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, ట్యాక్స్ సేవింగ్, ఆరోగ్య బీమా, ప్రధానమంత్రి సామాజిక బీమా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంక్‌ల కంటే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అన్ని రంగాల్లో పురోభివృద్ధి కలిగి ఉందన్నారు. ఖాతాదారులు బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పీవీ రామకృష్ణారావు, అసిస్టెంట్ మేనేజర్ హెప్సిబా, క్యాషియర్ అనూష, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పిచ్చయ్య, రీజినల్ మేనేజర్‌ను ఘనంగా సత్కరించారు.

కూలీల సంఖ్య పెంచాలి

ముండ్లమూరు: ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లే కూలీల సంఖ్య పెంచాలని దర్శి క్లస్టర్ ఏపీడీ పద్మశ్రీ సూచించారు. మండలంలోని శింగనపాలెం, పసుపుగల్లు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రోజూ మూడు వేల మంది కూలీలకు పనులు కల్పించాల్సి ఉందన్నారు. అందులో రెండు వేల మంది మాత్రమే పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఓ కొండయ్య పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుపై అవగాహన



రైతులకు భూగర్భ జలాలపై అవగాహన కల్పిస్తున్న ఏపీఐఐఏటీపీ టీమ్

పెద్దారవీడు: భూగర్భ జలాల పెంపు, సాగు నీటి వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని విజయవాడ ఏపీఐఐఏటీపీ సభ్యులు సూచించారు. మండలంలోని కంభంపాడు పంచాయతీ బోడిరెడ్డిపల్లె గ్రామంలో భూగర్భ జలాల యజమాన్యంపై ఏఓ బుజ్జిబాయి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఏపీఐఐఏటీపీ సభ్యులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం శాఖలు సంయుక్తంగా భూగర్భ జలాల యాజమాన్యంపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. చెరువులో అభివృద్ధి పనుల ద్వారా ఆయకట్టుకు కలిగే ప్రయోజనాలను వివరంచారు. కార్యక్రమంలో ఏపీఐఐఏటీపీ టీమ్ ఎస్‌వీ చలపతి, రవిశంకర్, విజయకుమార్, నోబిల్, టీహెచ్‌జీపీ జ్యోతిర్మయి, ఏపీడీ రోశమ్మ, ఇరిగేషన్ ఏపీడీ శ్రీనువాసరావు, టీఎల్ సుధాకర్, సీఓఐడీ నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.